క్లుప్తంగా

మర్రిపాలెం రైతుబజార్‌లో తనిఖీలు



రైతులతో మాట్లాడుతున్న డీడీ శ్రీనివాస్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజార్‌లో గురువారం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకుడు శ్రీనివాస్ కిరణ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. పచ్చిమిర్చి, టమాట, ఉల్లిపాయల కౌంటర్లను, రైతు గుర్తింపు కార్డులను, వ్యాపార దుకాణాలను పరిశీలించారు. అన్ని రకాల కూరగాయలు రైతుబజార్లలో అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని, లేనిపక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉల్లిపాయలు, బంగాళదుంపలు, టమాటాలు వంటివి నాణ్యమైన సరకులు మాత్రమే తెప్పించుకోవాలన్నారు. రైతుబజార్‌లో కొత్తగా జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. డీసీఎంఎస్ కౌంటర్ మేనేజర్‌తో వారు అద్దె బకాయిలు ఉండటం వల్ల త్వరగా చెల్లించాలని, లేకపోతే కౌంటర్‌ను రద్దు చేస్తామని ఫోన్‌లో మాట్లాడారు. వినియోగదారులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై రైతుబజారు ఈవో నాగేశ్వరరావును అడిగి తెలుసుకుని, సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన తాజా కూరగాయలు, ఆకుకూరలు అందించేలా శ్రద్ధ తీసుకోవాలని డీడీ శ్రీనివాస్ సూచించారు.

పోతిన రాము మృతి తీరని లోటు



రాము మృతదేహం వద్ద గాజువాక మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, సీపీఐ నాయకులు

మల్కాపురం: సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావు కుమారుడు పోతిన రాము అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మల్కాపురం, నగరాలవీధి ప్రాంతంలో నివాసముంటున్న రాము, తన తండ్రి బాటలో నడిచి సీపీఐకి ఎనలేని సేవలు అందించారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంత్రి రాజశేఖర్, భోగవిల్లి నాగభూషణం, సీపీఐ జిల్లా నాయకులు కాండ్రేగుల సత్యంజనేయ తదితరులు రాము భౌతిక కాయం వద్దకు వచ్చి నివాళులర్పించారు.

బుద్ధుడి ధ్యాన వనంలో పౌర్ణమి పూజలు



గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఉపాసకుడు నాగభూషణం, శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ పాస్‌పోర్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న తథాగతా గౌతమ బుద్ధా ధ్యాన వనంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తర ప్రదేశ్ మీరట్‌కు చెందిన బౌద్ధ దమ్మ ఉపాసకుడు బిక్కు నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుద్ధుడి విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన వనంలో భోగి చెట్టు నాటి తన సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో మూలపర్తి మల్లయ్యరాజు, గుణపూజ్ బాబులు, బాలయోగి, ఈశ్వరరావు, ధ్యాన వనం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణ సంకటంగా కేబుల్ తీగలు

- విద్యుత్ స్తంభాలు ఉరితాళ్లుగా మారాయని ప్రజల ఆగ్రహం
- గోపాలపట్నంలో కేబుల్ దందా.. ప్రమాదాలకు ఆపరేటర్ల నిర్లక్ష్యం కారణం



గోపాలపట్నం ప్రధాన రహదారిలో ప్రమాద కరంగా కేబుల్ తీగలు



పిచ్చు గూళ్లుగా వేలాడుతున్న కేబుల్ తీగలు



కేబుల్ తీగలను కత్తిరించేందుకు ప్రయాస పడుతున్న విద్యుత్ శాఖ సిబ్బంది



బుచ్చిరాజుపాలెం గవర వీధిలో కేబుల్ తీగలతో నిండి ఉన్న విద్యుత్ స్తంభం

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న కేబుల్ తీగలు ప్రజలకు ప్రాణ సంకటంగా మారాయి. ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లలోనూ ప్రమాదకరంగా వేలాడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గోపాలపట్నం ప్రధాన రహదారిలో కేబుల్ తీగలు తెగిపడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ కేబుల్ ఒకటి రోడ్డుపై వేలాడుతుండగా, దాన్ని సరిచేయడాని కి రెండు రోజులు పట్టిందని వాపోయారు. వాహనదారులు, పాదచారులకు ఆటంకం కలగకుండా రాళ్లతో, బరువుగల మూటలతో తీగలను కట్టి ఉంచాల్సి వచ్చింది.

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

కేబుల్ తీగలపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో పరిస్థితి విచ్చలవిడిగా తయారైందని, 'పిచ్చుక గూళ్ల కంటే దారుణంగా' ఉన్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. తెగిపడిన తీగలను సరిచేయకపోవడంతో అవి 'ఉరితాళ్లుగా' మారాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేబుల్ టీవీ తీగలకు బ్రాడ్‌బ్యాండ్ తీగలు కూడా తోడవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. సంబంధిత ఆపరేటర్లు తమ అవసరాలకు తగ్గట్టు తీగలను వేసి వెళ్లిపోతున్నారని, ఇతరులకు ఇబ్బంది కలుగుతుందా లేదా అని కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదకర పరిస్థితులు తలెత్తితే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల అండదండలతోనే ఈ కేబుల్ దందా సాగుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. కేబుల్ తీగలపై అధికారులు పర్యవేక్షణ పెంచాలని, ప్రమాద కరంగా ఉన్న తీగలను సరిచేయాలని, స్థానిక కేబుల్ ఆపరేటర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎటు చూసినా జనసంద్రమే..!

నమో నారసింహ స్మరణతో మార్మోగిన దారులు

గిరి ప్రదక్షిణతో రహదారులు కిటకిట



బుచ్చిరాజుపాలెం సుసర్ల కాలనీ లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ రోడ్డులో జన సందోహం

గోపాలపట్నం: ఈ ఏడాది సింహాచలం గిరిప్రదక్షణకు భక్తులు అపూర్వ సంఖ్యలో తరలి వచ్చారు. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు భక్తులు నిరంతరం నడుస్తూనే ఉండగా, రహదారులు రద్దీగా కనిపించాయి. సాధా రణంగా ఎన్ఎస్‌టీఎల్ నుంచి కుమారి కల్యాణ మండపం వైపు రోడ్డు రద్దీగా ఉన్నా, ఈసారి మోద కొండమ్మ పాదాల వద్ద నుంచి చాలా మంది భక్తులు దిగువ రోడ్డుకు మళ్లారు. అంతేకాకుండా, బీఆర్‌టీఎస్ రోడ్డులో కూడా భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. తెల్లవారుజామున ఈ మూడు రోడ్లు రద్దీగా మారి, ఉదయం 8:30 గంటల వరకు అదే పరిస్థితి కొనసాగింది. గిరిప్రదక్షణలో పాల్గొన్న భక్తుల గోవిందనామ స్మరణలతో గోపాలపట్నం, ఇందిరానగర్, లక్ష్మీనగర్ ప్రాంతాలు హోరెత్తాయి. కొంతమంది భక్తులు నరసింహ స్వామి అష్టోత్తర శత నామాలను చదువుతూ ప్రదక్షిణ చేశారు.



బంక్ జంక్షన్ మీదుగా సింహాచలం వెళుతున్న భక్తులు



ఇందిరానగర్ దిగువ రోడ్డులో భక్తుల రద్దీ

సేవా కార్యక్రమాలు భేష్

పలు స్వచ్ఛంద సేవా సంస్థలు అందించిన సేవలు భక్తులకు ఎంతో ఉపశమనాన్ని, శక్తిని ఇచ్చాయని పలువురు కొనియాడారు. సత్య సాయి భజన మండలి సంస్థ, జేడీ ఫౌండేషన్ సంస్థలు అందించిన మర్దన సేవ నడిచి అలసిన భక్తుల కాళ్ల నొప్పులను తగ్గించింది. జీవీఎంసీ మంచినీటిని అందించగా, దేవస్థానం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేశారు. ఉదయం 8 గంటల సమయంలో అందించిన సాంబార్ అన్నం, పులిహోర పంపిణీ అధిక సంఖ్యలో భక్తుల ఆకలిని తీర్చింది. భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి భోజనాలను స్వీకరించారు. తిరిగి వెళ్లే భక్తులు రైల్వే స్టేషన్లలో సేదతీరారు.



అన్నం, సాంబారు వడ్డిస్తున్న స్థానికులు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో సేద తీరుతున్న భక్తులు

విద్యుత్ స్మార్ట్ మీటర్లపై సీపీఎం నిరసన

మల్కాపురం: విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో పేదలపై నెలవారీ దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల సమస్యపై సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం 59వ వార్డు నెహ్రూనగర్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం, ఆపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, చంద్రబాబుది ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తర్వాత మరో మాట అని విమర్శించారు. గత ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు ఒక్క పైసా కూడా పెంచబోమని హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వేలకు వేలు వసూలు చేస్తూ ప్రజలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంత పరిధిలో ఇప్పటికే పలు వాణిజ్య దుకాణాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారని, దీనివల్ల వ్యాపారులు వేలకు వేలు చార్జీలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే, వారిని తిరిగి పంపాలని జగ్గునాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లు వద్దంటూ నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

లారీ బోల్తా

మల్కాపురం: నగరం నుంచి భారీ యంత్ర పరికరాన్ని తరలిస్తున్న ఓ లారీ గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కాన్వెంట్ బ్రిడ్జి మీదుగా మారుతి సర్కిల్ వైపు వెళ్తుండగా మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. లారీ బోల్తా పడుతున్న సమయంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బయటపడటంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో బోల్తా పడిన లారీని తొలగించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.


కనుల పండువగా గురుపౌర్ణమి వేడుకలు



ప్రశాంతినగర్‌లో సాయిబాబా



సాయినాథుడుకి విభూది అభిషేకం



శాకంబరి దేవి అలంకరణలో దుర్గమ్మతల్లి

గోపాలపట్నం: గురుపౌర్ణమి పర్వ దినం సందర్భంగా గురువారం నియోజకవర్గంలోని సాయిబాబా మందిరాలు భక్తులతో కళకళలాడాయి. గోపాలపట్నం ప్రశాంతినగర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, క్షీర పంచామృతాభిషేకాలు, అర్చనలు చేశారు. బాబాను విశేష పూలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. ప్రభుత్వ విప్ గణబాబు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు బాబా వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఆయా ఆలయాల అర్చకులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 59వ వార్డులోని గాజువాక ఆర్టీసీ డిపో, పాత చెక్‌పోస్టు వద్ద గల సాయిబాబా ఆలయంలో తెల్లవారుజామున 6 గంటల నుంచే పంచామృతాలు, విభూదితో అభిషేకాలు, హారతి పూజలు జరిపారు. ఈ పూజల్లో జిల్లా యాదవ సంఘం ప్రతినిధి పుర్రె అప్పారావు యాదవ్ పాల్గొన్నారు. అలాగే 60వ వార్డు గుల్లలపాలెం, మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న సద్గురు షిర్డీసాయిబాబా ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ విభూదితో అభిషేకం చేయగా, పలువురు భక్తులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కొందరు మహిళలు బాబా కీర్తనలకు కోలాట నృత్యాలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. చిన్నారులు బాబా భక్తి గీతాలకు నృత్య ప్రదర్శనలిచ్చారు. స్థానిక ఐవోసీ చింతామణి దుర్గా గణపతి ఆలయంలోని సాయిబాబాకు కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు బాబా దర్శనం కోసం బారులు తీరారు. 58వ వార్డు పిలకవానిపాలెం కొండ ప్రాంతంలో కొలువుదీరిన దుర్గాదేవి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గిన్ని శివరెడ్డి దంపతులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



అంబేద్కర్ నగర్ సాయి మందిరం వద్ద అన్నప్రసాదం వడ్డిస్తున్న జియ్యాని శ్రీధర్



షిప్‌యార్డ్ కాలనీ మందిరంలో సాయినాథుడికి అభిషేకం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యుడు

ఘనంగా పూజలు, మహాన్నదానం

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు అంబేద్కర్ నగర్‌లోని శ్రీ షిర్డీసాయి రామ మందిరంలో ఆలయ ధర్మకర్త పాలిమేర వెంకట ఆదినారాయణ అనురాధ దంపతుల ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, కాకడ హారతి, అభిషేక సేవా కార్యక్రమాలు, విశేష పూజలు జరిపారు. జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ ప్రతినిధులు దుశ్శాలువాతో సత్కరించి బాబా వారి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయం ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నసమారాధనను ఆలయ ధర్మకర్తతో శ్రీధర్ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు ఎల్లపు వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, కోలాట బృంద మహిళలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



త్రినాథపురం మందిరంలో సాయిబాబాకు పూలమాల వేస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు



బాబాను దర్శించుకుంటున్న భక్తులు



గుల్లలపాలెం వద్ద సాయి మందిరం పుష్పాలతో అలంకరణ

బాబాకు ప్రత్యేక అభిషేకాలు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలోని షిర్డీసాయిబాబా మందిరంలో అంబుల సాంబశివరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వారు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, రాష్ట్ర ఆర్టీఐ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, అంబలు సాంబశివరావు ట్రస్ట్ సభ్యులు నాగభూషణరావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- 40వ వార్డు షిప్‌యార్డ్ కాలనీలోని షిర్డీసాయి బాబా మందిరంలో ఆలయ కమిటీ సభ్యుడు కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సాయినాథుడిని పురవీధుల్లో ఊరేగించి, భజన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థుల ప్రగతిపై చర్చ



గోపాలపట్నం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఎమ్మెల్యే గణబాబు



40వ వార్డు పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

గోపాలపట్నం: నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లు నిర్వహించారు. గోపాలపట్నం బాలుర పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. విద్యార్థుల విద్యాభ్యాసం బాగుందని, ఇటీవల వచ్చిన ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిపై చర్చించారు. పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో పలు సామాజిక అంశాలపై మాట్లాడించారు.

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్‌లోని సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో ఆత్మీయ సమావేశాన్ని శరగడం అరుణ్‌కుమార్ ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీకుమార్, 90వ వార్డు ఇన్‌చార్జి బాబి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవితకు తోడ్పడాలని కోరుతూ ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- 63వ వార్డు చింతల్లోవ ఆదర్శ రాయల్ పాఠశాల, జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల, కాకరలోవ ఎస్ఎస్‌వీ స్కూల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశాలను జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ గల్లా చిన్నా ప్రారంభించారు. పిల్లల చదువులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం కీలకమని. వార్డు అధ్యక్షుడు జెర్రిపోతుల నర్సింగరావు, వార్డు సెక్రటరీ గూడేల కృష్ణ, స్థానిక నాయకులు పుక్కల కృష్ణ, ధర్మ, కనక, చందాని, నరీన్, ధనుంజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గం

సీతంపేట: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం సీతమ్మధారలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. క్లబ్ అధ్యక్షుడిగా కూటికుప్పల రవికిరణ్ ప్రసాద్, కార్యదర్శిగా పీబీఎస్ఎన్ రెడ్డి, కోశాధికారిగా ప్రశాంతి, ఉపాధ్యక్షులుగా షీలా, క్లబ్ డైరెక్టర్లుగా వై.వి.వి.సత్యనారాయణ, మిరియాల వేణుగోపాల్, రామ్ పలిశెట్టి, శ్రీనివాస్ రెడ్డి, హరిత, షరిమల, నాగిరెడ్డి, కృష్ణయ్య తదితరులు రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి చేతుల మీదుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో హనుమంతవాక జంక్షన్‌లో మెట్రో గ్రీన్ పేరిట పెంచుతున్న మొక్కలు, గోపాలపట్నంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ గవర్నర్ కె.సునీత లావణ్య, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మొదిలి మహేష్ పాల్గొన్నారు.

'చెత్త' శుద్ధి కరవు

ఎక్కడికక్కడే వ్యర్థాలు





గోపాలపట్నం: గిరిప్రదక్షిణ జీవీఎంసీ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఒక పండుగలా మారిందని, ప్రజలకు మాత్రం చెత్తే మిగిలిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా బయట నుంచి కాంట్రాక్ట్ ద్వారా పనివారిని తీసుకువచ్చారు. జోన్ 8 పరిధిలోని 90, 91, 92 వార్డుల్లో సుమారు 100 మందికి పైగా పనివారిని నియమించారు. ఈ వార్డులనే జోన్లుగా మార్చి రహదారులను శుభ్రపరిచే పని చేయాలని ఆదేశించారు. 90వ వార్డుకు 30 మందిని, 91వ వార్డుకు 35 మందిని, 92వ వార్డుకు 42 మందిని ఏర్పాటు చేశారు. అయితే 92వ వార్డులో వచ్చిన పనివారికి పని పరికరాలు అందక 10 గంటల వరకు వ్యర్థాలు తొలగించలేదు. వీరికి గోనె సంచులు చేతికి ఇచ్చి రోడ్డుపై పడిన చెత్తను ఏరి వాహనాలకు అందించాలని సూచించారు. ఇది మధ్యాహ్నం వరకు సాగినా, ఆ తర్వాత వీరెవరూ రోడ్లపై కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు.

చెత్త నిర్వహణపై నిర్లక్ష్యం

స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు టీలు, టిఫిన్లు, పండ్లు అందించే చోట కనీసం డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుండాలని ప్రజలు పేర్కొన్నారు. వ్యర్థాలను డంపింగ్ చేసే స్థలాలను గుర్తించి ఆ ప్రాంతంలో వేసే విధంగా నిర్వాహకులకు ముందస్తుగా సూచించినట్లయితే బాగుండేదని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. ఎవరూ చెత్త నిర్వహణపై పట్టించుకోక పోవడంతో భక్తులు ప్రదక్షిణ చేసే రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వ్యర్థాలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, గ్లాసులు, ప్లేట్లు వంటి వాటితో నిండిపోయాయి. గురువారం ఉదయం వీటిని జీవీఎంసీ సిబ్బందే శుభ్రం చేయాల్సి వచ్చింది. కాంట్రాక్ట్ సిబ్బంది వల్ల నిధులు వృథా తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇది కాంట్రాక్టర్లకు, కమీషన్లు పొందే అధికారులకే లాభసాటిగా మారిందని విమర్శిస్తున్నారు.

